సాక్షి తిరుపతి

ఆదివారం । 9 । జూన్ । 2024



ఉద్యోగ భద్రత కల్పించండి

కొత్త ప్రభుత్వంలో ఎస్పీవోలకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు శనివారం డిమాండ్ చేశారు.

- 8లో



సముదాయిస్తూ..

చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ మూకల దాడిలో గాయపడిన కుటుంబాలను చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు.

- 8లో



కృత్రిమ అవయవాల పంపిణీ

తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో 110 మంది దివ్యాంగులకు శనివారం కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

రేణిగుంట: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ ఎం.శోభారాణిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్టాంపు డ్యూటీ, వివిధ పత్రాల విక్రయం ద్వారా వచ్చిన మొత్తంలో రూ.21,53,110 ను ప్రభుత్వానికి చెల్లించకుండా సొంతానికి వాడుకున్నట్లు తేలడంతో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. రెండేళ్ల నుంచి ఆమె ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆమె రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. రేణిగుటంలో తిష్ట వేసిన కొందరు స్టాంపు వెండర్లు, కార్యాలయంలోని కొంతమంది సిబ్బంది కలసి బేరసారాలు కుదురుస్తారని ఆరోపణలున్నాయి. అన్నీ డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా రిజిస్ట్రేషన్ కోసం ముడుపులు చెల్లించాల్సిందేనని ఫిర్యాదులున్నాయి. అయితే ప్రభుత్వానికి చెల్లించే రుసుంను సైతం స్వాహా చేసి లెక్కలు తారుమారు చేయడం పట్ల అధికార యంత్రాంగం శోభారాణిని సస్పెండ్ చేసినట్టు తెలిసింది.

కలెక్టరేట్‌లో బదిలీల గుబులు

తిరుపతి అర్బన్: రాష్ట్రంలో ప్రభుత్వం మారుతున్న నేపథ్యంలో ఉద్యోగులకు బదిలీల గుబులు పట్టుకుంది. మరో పది రోజుల తర్వాత బదిలీల ప్రక్రియ ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రధానంగా తిరుపతి కలెక్టరేట్‌లో ఏ, బీ బ్లాక్‌ల పేరుతో ఏడు అంతస్తులున్నాయి. 30 విభాగాలకు చెందిన అధికారులు పనిచేస్తున్నారు. వీరంతా తమకు బదిలీలు తప్పవనే సంకేతాలు ఉండడంతో ఆ దిశగా ఆలోచనల్లో మునిగితేలుతున్నారు. సాధారణంగా ప్రభుత్వాలు మారినప్పుడు బదిలీలు తప్పవనే అంశాన్ని ముందుకు తెస్తున్నారు. 2022 ఏప్రిల్ 4వ తేదీన పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన కార్యక్రమాన్ని చేపట్టారు. 26 నెలల క్రితం కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా తిరుపతి కలెక్టరేట్‌తోపాటు వివిధ విభాగాలకు చిత్తూరు, వైఎస్సార్ కడప, కర్నూల్, పొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, ఉభయగోదావరి, విశాఖపట్నం జిల్లాల నుంచి పలువురు అధికారులు తిరుపతి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇప్పుడు వీరంతా తమకు బదిలీలు తప్పవని ఆందోళనలో పడిపోయారు. ముఖ్యంగా కొందరు ప్రధాన స్థానాల్లో పోస్టింగ్ కోసం అధికార పార్టీ కొత్త ఎమ్మెల్యేల వద్దకు క్యూకడుతున్నారు. తమ సొంత జిల్లాలకు వెళ్లడానికి తీవ్రమైన ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆ మేరకు అంతా బదిలీలపై చర్చించుకుంటున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన తర్వాత బదిలీల ప్రక్రియను వేగవంతం చేయడానికి జిల్లా అధికారులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారికి అనుకూలంగా ఉన్న ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకం పేరుతో కలిసి బదిలీ అంశాన్ని ఒక మాట ఎమ్మెల్యేలకు చెప్పిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా కలెక్టరేట్‌లోని విభాగాలకు మరో నెల రోజుల లోపు కొత్త అధికారులు వస్తారని చర్చసాగుతోంది.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తులతో కిక్కిరిసింది. శనివారం ఒక్క రోజే సుమారు 31 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 1,407 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 2,878, రూ.500 రాహు-కేతు పూజలకు 2,654, రూ.750 పూజలకు 1,074, రూ.1,500 పూజలకు 379, రూ.2,500 పూజలకు 275, రూ.5వేల పూజలకు 89 మంది భక్తులు పాల్గొన్నారు. ప్రసాదాలు 20,854 విక్రయించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

SUNDAY SPECIAL

ఓ చెట్టు.. సాక్షాత్తు ప్రధానమంత్రి కార్యాలయాన్నే కదిలించింది.. జాతీయ రహదారి రూటు మార్చింది.. నేషనల్ హైవే అథారిటీ అధికారులకు ముచ్చెమటలు పట్టించింది.. చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ సిక్స్‌వే అలైన్‌మెంట్ మార్పునకు కారణంగా నిలిచింది. ఇదేంటని ఆశ్చర్యపోతున్నారా..?.. సర్వత్రా చర్చనీయాంశంగా మారిన ఈ ఘటన పలమనేరు మండలంలో చోటు చేసుకుంది. ఒక్క రైతు పట్టుదల ఔషధ గుణాలతో విరాజిల్లే పురాతన వృక్షం ఉనికిని రక్షించింది. అభివృద్ధి పనులకు భూమి కోల్పోయినా పర్వాలేదు కానీ.. వంశ పారంపర్యంగా కాపాడుకుంటూ వస్తున్న అర్జున చెట్టును కూల్చేందుకు అంగీకరించని వ్యక్తిత్వం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

ఔరా.. అర్జున



పలమనేరు మండలం జల్లిపేట వద్ద హైవే పక్కన ఉన్న అరుదైన అర్జున చెట్టు

- పీఎంఓను కదిలించిన పురాతన చెట్టు
- మారిన చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే అలైన్‌మెంట్
- కారణంగా నిలిచిన 150 ఏళ్లనాటి అరుదైన వృక్షం
- ఔషధ గుణాలున్న చెట్టును కూల్చేందుకు ఒప్పుకోని రైతు
- ప్రధానమంత్రి కార్యాలయం చొరవతో రహదారి రూట్ మార్చిన అధికారులు

పలమనేరు : భారత ప్రధాని కార్యాలయాన్ని ఓ చెట్టు కదిలించడం ఏంటని ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. అయితే ఇది పచ్చినిజం. తమ భూమి ఎక్స్‌ప్రెస్ హైవేకి వెళ్లినా బాధపడని ఓ రైతు ఆ చెట్టును కూల్చేందుకు మాత్రం ఒప్పుకోలేదు. నేషనల్ హైవే అథారిటీపై ప్రధాని కార్యాలయానికి ఫిర్యాదు చేసి మరీ ఆ చెట్టును కూల్చకుండా కాపాడుకున్నారు. చివరకు రోడ్డు మార్గాన్నే మార్చేలా చేసి సంచలనం సృష్టించారు. ఈ ఘటన పలమనేరు మండలంలో జరిగింది. వివరాలు.. జల్లిపేటకు చెందిన సుబ్రమణ్యం అనే రైతు, స్థానిక కోర్టులో సీనియర్ న్యాయవాదిగా సైతం సేవలందిస్తున్నారు. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా ఆయన భూమిని సైతం అధికారులు సేకరించారు. తర్వాత రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆయన పొలంలోని సుమారు 150 ఏళ్ల నాటి ఔషధ గుణాలున్న అర్జున వృక్షాన్ని హైవే అధికారులు కూల్చేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సుబ్రమణ్యం వెంటనే హైవే అథారిటీని సంప్రదించారు. ఆ చెట్టు ప్రాముఖ్యత, తమ పూర్వీకులనుంచి ఎలా కాపాడుకుంటూ వచ్చామనే విషయాన్ని వివరించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే చెట్టును వదిలేయమని విన్నవించారు. అయితే హైవే అధికారులు పట్టించుకోలేదు. దీంతో సుబ్రమణ్యం ఈ విషయాన్ని ప్రధానమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. ఔషధ గుణాలున్న విశిష్ట వృక్షాన్ని రక్షించాలని లేఖ రాశారు. ఈ చెట్టు ప్రాముఖ్యతను పరీక్షించేందుకు ప్రత్యేక నిపుణుల బృందాన్ని పంపించాలని పేర్కొన్నారు.

అనుకూలంగా నిపుణుల నివేదిక

సుబ్రమణ్యం లేఖపై పీఎంఓ స్పందించింది. చెట్టు విషయంలో వాస్తవాలను పరిశీలించాలని నిపుణుల బృందాన్ని గ్రామానికి పంపించింది. ఈ మేరకు నిపుణులు సమగ్రంగా చెట్టును పరిశీలించి అది అరుదైన ఔషధగుణాలున్నట్లు గుర్తించారు. ఇదే అంశాన్ని నివేదికలో పొందుపరిచారు. నిపుణుల సూచనలను పీఎంఓ పరిగణనలోకి తీసుకుంది. చెట్టును తొలగించకుండా రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని నేషనల్ హైవే అథారిటీని ఆదేశించింది. చివరకు చెట్టు పక్క నుంచి రహదారి వెళ్లేలా అధికారులు నిర్మాణ పనులు చేపట్టారు. కొత్తగా వేస్తున్న ఈ రోడ్డు పక్కన కొన్ని కిలోమీటర్ల పరిధిలో కనపడే చెట్టు ఇదొక్కటే కావడం విశేషం.

విశేష గుణాలు



ఈ చెట్టును శాస్త్రీయంగా టెర్మినలియా అర్జున అని పిలుస్తారు. ఇక్కడి ప్రజలు అర్జునుని చెట్టుగా చెప్పుకుంటారు. ఇది వృక్ష శాస్త్రంలో కాంబ్రేటేసీ కుటుంబానికి చెందినదిగా రైతు సుబ్రమణ్యం తెలిపారు. ఈ చెట్టు బెరడును గుండె నొప్పి, అధిక రక్తపోటు నివారణకు, కషాయాన్ని రక్తప్రసనరణ సమస్యలు, అల్సర్ అరికట్టేందుకు వినియోగిస్తారని వెల్లడించారు. పాము, తేలు కాటుకు సైతం మందుగా వాడతారని వివరించారు. చెవిలో చీము కారడం, చెవి నొప్పి, దంతక్షయం నివారణకు, టూత్‌పేస్ట్‌గా సైతం ఇక్కడి వారు వినియోగిస్తుంటారని తెలిపారు.

ఎట్టకేలకు కాపాడుకున్నా



"అరుదైన అద్భుత ఔషధగుణాలున్న చెట్టును కొట్టేస్తారంటే చాలా బాధగా అనిపించింది. అందుకే ఈ చెట్టుకోసం ఏడాదిపాటు కష్టపడ్డా. అందరి దృష్టికీ తీసుకెళ్లా. చివరకు ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాలతో ఎట్టకేలకు చెట్టును కాపాడుకున్నా. ఇప్పుడు చాలా సంతృప్తిగా ఉంది. ఎంతో విలువైన ఈ చెట్టును రక్షించినందుకు జాతీయ వృక్ష అవార్డుకు సైతం నన్ను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– సుబ్రమణ్యం, రైతు, జల్లిపేట, పలమనేరు మండలం

11న అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల: లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై జూన్ 11వ తేదీ 11వ విడత అయోధ్య కాండ అఖండ పారాయణం జరగనుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. అయోధ్య కాండలోని 40 నుంచి 44వ సర్గ వరకు మొత్తం ఐదు సర్గల్లో 162 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 187 శ్లోకాలను పారాయణం చేయనున్నారు. ఎస్వీ వేద విజ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, టీటీడీ సంభావన పండితులు, శ్రీ అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు పాల్గొననున్నారు.

ముస్లింలకు ప్రాధాన్యతనివ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షులు జాఫర్ పులి

తిరుపతి(అలిపిరి): త్వరలో ఏర్పాటు కానున్న మంత్రి వర్గంలో ముస్లింలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షులు జాఫర్‌పులి కోరారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల వైపు అడుగులు వేయాలని సూచించారు. కూటమి విజయంలో ముస్లిం, మైనారిటీల పాత్ర కీలకంగా ఉందన్నారు. ఈ క్రమంలో వారికి ప్రాధాన్యత కల్పిస్తూ రెండు మంత్రి పదవులు ఇవ్వాలని సూచించారు. అలాగే రాష్ట్రానికి ప్రత్యేకహోదా తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రంలో పలుచోట్ల దాడులు జరగడం బాధాకరమన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ నూర్, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు నిజాముద్దీన్, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసినా మార్పునే కోరారు!

- తుడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నా
- 25 ఏళ్లకే ప్రజాసేవ చేసేందుకు అవకాశం కలిగింది
- రూ.980 కోట్లతో చంద్రగిరిని అభివృద్ధి చేశాం
- సహకరించిన అందరికీ ధన్యవాదాలు
- ఎమ్మెల్యేగా గెలిచిన పులివర్తి నానికి శుభాకాంక్షలు
- అల్లర్లు వద్దు.. అభివృద్ధి చేయాలని కోరుతున్నా
- మీడియా సమావేశంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'పాతికేళ్ల వయస్సులోనే ప్రజా సేవ చేసేందుకు జగనన్న అవకాశం ఇచ్చారు.. తిరుపతి రూరల్ మండల పరిషత్ అధ్యక్షునిగా.. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసే అదృష్టం కలిగింది. టీటీడీ పాలకమండలిలో స్థానం దొరకడంతో భక్తులకు కూడా సేవ చేసే భాగ్యం దక్కింది. ప్రజలకు, శ్రీవారి భక్తులకు సేవ చేసే భాగ్యం కలగడం నా అదృష్టంగా భావిస్తున్నా.. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను మా నాన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు మా కుటుంబం మొత్తం కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాం. మంచి చేయడం మాత్రమే తెలిసిన మాకు, మా శక్తి వంచన లేకుండా సాయం చేశాం. గ్రామాల్లో అభివృద్ధి తప్ప అల్లర్లకు తావు ఇవ్వలేదు. ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను ఎంతో గౌరవించాం. అభివృద్ధిలో చంద్రగిరిని దేశానికే ఆదర్శంగా చూపించాలని కష్టపడ్డాం. అందరికీ మంచి చేసినా ప్రజలు మార్పు కోరుకున్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నా. చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిచిన పులివర్తి నానికి శుభాకాంక్షలు. ఇకపై అల్లర్లకు అవకాశం లేకుండా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్రంలో ప్రభుత్వం మారినందున తన తుడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నా. ఇంతకాలం అభివృద్ధి పనులు చేయడానికి సహకరించిన ప్రభుత్వ ఉద్యోగులు, అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రతిపక్షంలో ప్రజలకు అండగా నిలబడి వారికి మరింత దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తా.. ఈ ఎన్నికల్లో నాకు ఓట్లు వేసిన లక్ష మందికి పాదాభివందనం చేస్తున్నా. ఓటు వేయని వారు కూడా మీ బిడ్డగా ఆదరించాలని కోరుకుంటున్నా.'' అంటూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటలోని ఆయన నివాసం వద్ద శనివారం జరిగిన మీడియా సమావేశంలో మోహిత్‌రెడ్డి మాట్లాడారు. తుడా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గత 5 ఏళ్లలో ఎప్పుడూ చంద్రగిరిలో ఇలాంటి అల్లర్లు జరగలేదని, ప్రత్యర్థి పార్టీల వారిపై దాడులు చేయడం మంచిది కాదన్నారు. అభివృద్ధిలో చంద్రగిరిని దేశానికి ఒక ఆదర్శంగా చేయాలని రూ.980 కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజలకు నిజాయితీగా సేవ చేశామని, ప్రతి పక్ష తెలుగు దేశం పార్టీ కార్యకర్తలను ఎంతో గౌరవంగా చూశామన్నారు. ప్రజా సేవకై వచ్చిన తర్వాత చంద్రగిరి నియోజకవర్గం మొత్తం 1,600 వందల కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకున్నట్లు వివరించారు. తనతో పాటు కుటుంబం మొత్తం జనంలోనే తిరుగుతూ ప్రజా సమస్యలు పరిష్కారానికి పని చేసినట్టు వెల్లడించారు. ప్రజల సంతోషం కోసం అహర్నిశలు శ్రమించి కరోనా వంటి కష్టంలో ఆదుకున్నామన్నారు. ఏడాది కాలంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్ని పనులు మానుకుని తన వెంట తిరుగుతూ ఎంతో కష్ట పడ్డారని, వారందరికీ రుణపడి ఉంటానని వెల్లడించారు. టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన పులివర్తి నానికి అభినందనలు తెలిపిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆయన ప్రజలకు మరింత సేవ చేసి, మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.



రోగిని స్ట్రెచ్చర్‌పై తీసుకెళ్తున్న బంధువులు



వీల్‌చైర్‌పై రోగిని తీసుకెళ్తున్న సహాయకుడు

రుయా.. ఇంతేనయా.!



రుయా ఓపీ బ్లాక్ నుంచి రోగిని భుజాలపై తీసుకెళ్తున్న బంధువులు

కనిపించని దేవుడు ప్రాణం పోస్తే.. కనిపించే డాక్టర్లు ప్రాణాలు నిలబెడతారని ప్రజలు నమ్ముతారు. ఆస్పత్రే దేవాలయంగా కొలుస్తారు. అందుకే దేవుడి తర్వాత డాక్టర్లకు అంత ప్రాధాన్యం ఇస్తారు. కానీ కలియుగ దైవం శ్రీనివాసుడి పాదాల చెంత ఉన్న తిరుపతి రుయాలోని కొందరు డాక్టర్లు, సిబ్బంది తీరుతో రోగులు నరకం అనుభవిస్తున్నారు. స్ట్రెచర్‌తోసే వార్డు బాయ్ కూడా రోగుల సహాయకులకు చుక్కలు చూపుతున్నారు. పేదల ప్రాణాలే కదా.. పోతే పోనీ అని గాలికొదిలేస్తున్నారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆప్తులను కాపాడుకోలేక రక్తసంబంధీకులు పడరాని పాట్లు పడుతున్నారు. తమ బంధువుల ప్రాణాలు కాపాడుకోవడానికి స్ట్రెచర్లు తోస్తూ.. రోగులను మోస్తూ.. వీల్ చైర్లు నెట్టుకొంస్తూ.. నిత్యం ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. అయ్యా.. బాబూ.. అని కాళ్లావేళ్లా పడుతున్నా కరుణించే నాథుడే కరువవుతున్నారు. రోగులకు సేవకులుగా ఉండాల్సిన స్ట్రెచర్ బాయ్స్ ఎక్కడా కనిపించడం లేదు. ఒక వేళ ఉన్నా కాసులు ఇస్తే తప్ప కనికరించడంలేదు. దీనిపై సంబంధిత అధికారులూ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

కమనీయం.. కల్యాణం



విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు



శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం విశేష అభిషేకాలు, అలంకరణలు చేపట్టి స్వామి,అమ్మవార్లను నిత్యకల్యాణ మండపానికి వేంచేపు చేశారు. అక్కడ వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామి,అమ్మవార్ల కల్యాణం జరిపించారు. అనంతరం రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ ఆగమోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి, స్వామి,అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

తిరుపతి(అలిపిరి): మద్య నిషేధంలో భాగంగా 2020లో లిక్కర్, ఎర్రచందనం, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం నియమించుకున్న 2,156 మంది ఎస్పీవో(స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్)ను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని.. ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీఎస్పీవో సివిల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ధర్మచంద్ర కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1,156 మందిని స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా ఎంపిక చేశారని.. రెండేళ్లపాటు కష్టపడి పోలీసులతో పాటు తాము రాష్ట్ర సరిహద్దుల్లో విధులు నిర్వహించామన్నారు. రెండేళ్ల క్రితం తమకు ఎలాంటి సమాచారం లేకుండాలనే పక్కన పెట్టారని వాపోయారు. ఎస్పీవోలు రాజేష్, డేవిడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

చంద్రగిరి: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో డ్రైవరు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు.. చంద్రగిరి కోట గ్రామానికి చెందిన రంజిత్ కుమార్(34) ఆటో డ్రైవర్. శుక్రవారం మండల పరిధిలోని నడింపల్లికి వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి చంద్రగిరికి వస్తున్న క్రమంలో మామండూరు వద్ద ముందు నిలబెట్టిన లారీని ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఆపై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

యస్.వి.ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టల్, తిరుపతి

టెండరు ప్రకటన

యస్.వి.గవర్నమెంట్ పాలిటెక్నిక్ హాస్టల్, తిరుపతి హాస్టల్ విద్యార్థుల కొరకు 2024-25 సంవత్సరానికి కావలసిన కూరగాయలు, అరటి పండ్లు, పాలు మరియు పెరుగు, చికెన్ మరియు కోడిగుడ్లు, కిరాణ సరుకుల బియ్యము సరఫరా చేయుటకు తప్పనిసరిగా (1) FSSAI LICENCE (2) AGMARK AND TRADE LICENCE (3) TURNOVER CERTIFICATE (4) PAN CARD (5)IT AND AUDIT RETURNS (5YEARS) (6) GST REGISTRATION (7) EXPERIENCES CERTIFICATION (8) ISO CERTIFICATE (9) SOLVENCY CERTIFICATE లైసెన్సులు రిజిస్ట్రేషను కలిగినవారు విడివిడిగా సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. పాలు, పెరుగు సరఫరా చేయువారు Fridge ను Mess నందు ఉంచవలెను. టెండరు ఫారం ఖరీదు కిరాణా సరుకులకు రూ.1000/- ఇతర టెండరు ఫారం ఖరీదు రూ.500/- డి.డి. రూపంలో చెల్లించి 11.06.2024 నుండి 17.06.2024 వరకుఅన్నీ పనిదినములలో పొందవచ్చును. సీల్డ్ టెండర్లను 17.06.2024వ తేదిన మధ్యాహ్నం 3 గంటల లోపు కళాశాలలో వుంచిన టెండర్ బాక్సునందు వేయవలెను. సీల్డు వేయబడిన టెండర్లను 18.06.2024వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు టెండరు దారుల సమక్షంలో తెరవబడును. టెండర్‌దారులు తప్పనిసరిగా హాజరు కావలెను. ఏ విధమైన నోటీసు, ఏ కారణం లేకుండా ఏ ఒక్క టెండర్ మరియు అన్ని టెండర్లు అంగీకరించుటకు రద్దు చేయుటకు టెండరు వాయిదా వేయుటకు అన్నీ హక్కులు ప్రధానాచార్యులు వారు కలిగివున్నారు. ఇంకనూ పూర్తి వివరాలకు కళాశాల ప్రధానాచార్యులను సంప్రదించవలెను.

సం/- వార్డెన్, ఎస్.వి.జి.పి. హాస్టల్, తిరుపతి

హెచ్చరిక

ఇందుమూలముగా మా క్లయింటు **KSR Infra Tech (P) Ltd., Regd. Company, Director** అయిన **K.Raja, S/o K.Srinivasa Rao** సూచన మేరకు యావన్మంది ప్రజానీకానికి ఇస్తున్న పత్రికా ద్వారా తెలియజేయడమేమనగా!

మా క్లయింటు తన కంపెనీ తరపున ప్రతివాదులుగా వున్న **Late కందాటి శంకర్ రెడ్డి, D.No.23-8-49, జై శంకర్ నగర్, Airbypass Road, Tirupati** మరియు శ్రీకాళహస్తి వాస్తవ్యులు అయిన శాంతారాం పవార్ గారి వద్ద షెడ్యూల్డు దాఖలా భూమిని 2-10-2018న Bank ద్వారా రూ.70,00,000/-లు అడ్వాన్సుగా ఇచ్చి అభివృద్ధి పరచుటకు తీసుకొనడం జరిగింది. సదరు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్‌లోని నిబంధనలు పై వ్యక్తులు ఉల్లంగించినందున మా క్లయింటు తిరుపతి, 5వ అదనపు జిల్లా కోర్టులో O.S.No.84/2021 కేసువేయడం జరిగింది. సదరు కేసు ప్రస్తుతం విచారణకు వచ్చుచున్నది. కాని **లేట్ కందాటి శంకర్ రెడ్డి గారు మరియు శాంతారామ్ పవార్ గారి** వారసులు MOU లో వున్న నిబంధనలు అతిక్రమించి O.S.No.84/ 2021, 5వ అదనపు జిల్లా కోర్టులో pending ఉండగా మరల M/s ASVI Infra Tech (P) Ltd., బెంగళూర్ అనే కంపెనీ తరపున సదరు కంపెనీ డైరెక్టర్‌లతో 9.03.2023 ఒక డెవలప్‌మెంట్ వ్రాసుకొని సదరు డెవలపర్‌లకు షెడ్యూల్ భూమిని స్వాధీనం చేసి సదరు భూమిలో అభివృద్ధి కార్యక్రమాలు చేయుచున్నట్లు మా క్లయింటుకు సమాచారం వచ్చింది.

కావున యావన్మందికి తెలియజేయడం ఏమనగా తిరుపతి 5వ అదనపు జిల్లా కోర్టు ఓ.ఎస్.నెం. 84/2021 పెడింగ్ ఉన్నాందున సదరు షెడ్యూలు భూమిలో జరగబోవు క్రయ విక్రయాలు చెల్లవు.

షెడ్యూల్డు: చిత్తూరు జిల్లా (తిరుపతి), శ్రీ బాలాజి సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి రూరల్ మండలం, దామినేడు గ్రామ దాఖలా లేట్ కందాటి శంకర్‌రెడ్డికి చెందిన Sy.No: 34/1A Ac 2.46 సెంట్లు, Sy.No: 35/4 లో Ac 4.90 సెంట్లు, శాంతారామ్ పవార్‌కి చెందిన Sy.No. 34/1B కి చెందిన Ac 1.00 Cents కి హద్దులు. మొత్తం భూమి ఎ.8.36 సెంట్లు. **ఉత్తరం:** రామక్రిష్ణారెడ్డి భూమి, **దక్షిణం:** హరినాథనాయుడు భూమి, **తూర్పు:** క్రిష్ణమూర్తి నాయుడు భూమి, **పడమర:** Sy.No: 36/2లో వున్న రోడ్డు మరియు లేట్ శంకర్‌రెడ్డి భూమి.

మా క్లయింటు: **K. Srinivasa Rao, Cell No. 9652938059, 9381559269**

సం/- కె.గుర్రప్పనాయుడు, అడ్వొకేటు, తిరుపతి

సముదాయిస్తూ.. సంఘటితం చేస్తూ!

'చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు విధ్వంసం సృష్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. పలు చోట్ల ఇళ్లను ధ్వంసం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అల్లర్లు సృష్టిస్తున్నారు. రక్షణ కోసం వెళ్లిన బాధితులను పోలీస్ స్టేషన్లోనే కొడుతున్నారు. దాడుల్లో గాయపడ్డ వారిని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఓదార్చుతూ వారికి అండగా నిలుస్తున్నారు. అలాగే పార్టీ నాయకులందర్నీ సంఘటితం చేస్తూ సమస్యాత్మక గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నియోజకవర్గంలో నిరంతరాయంగా పర్యటించారు.



పాకాల: ఊట్లవారిపల్లికి చెందిన గంగయ్య కుటుంబాన్ని ఓదార్చుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- చంద్రగిరిలో చెవిరెడ్డి సుడిగాలి పర్యటన
- దాడికి, ప్రతిదాడి పరిష్కారం కాదనే ఓపికతో ఉన్నాం
- అకారణంగా కొడుతుంటే ఎదురుదాడి చేయక తప్పదు
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా
- మీ అందరి కోసం.. దేనికైనా సిద్ధంగా ఉన్నా..
- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి

చంద్రగిరి: నియోజకవర్గంలోని పాకాల మండలం, రమణయ్యగారిపల్లి సర్పంచ్ యువరాజు ఇంటిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి ధ్వంసం చేయడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇకపై ఏమి జరిగినా తాను అండగా నిలబడతానని ధైర్యం చెప్పారు. తరువాత ఊట్లవారిపల్లి గ్రామంలో గంగయ్య కుటుంబీకులపై దాడి చేయగా వారిని పరామర్శించారు. అలాగే పాకాల పట్టణంలో పూలు అమ్ముకుంటున్న సతీష్ దుకాణాన్ని ధ్వంసం చేయగా.. ఈ మేరకు చెవిరెడ్డి వెళ్లి దుకాణాన్ని పరిశీలించి ఆర్థికంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రామచంద్రాపురం మండలం, రాయల చెరువు గ్రామంలో మురగయ్య కుటుంబీకులను, పరమాలలో హరి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కొత్త చెరువు దళితవాడకు చెందిన చిరంజీవిని చితకబాదడంతో అతని గాయాలను చూసిన చెవిరెడ్డి చెలించిపోయారు. బ్రాహ్మణకాలువకు చెందిన చెంగయ్య వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయించారన్న అక్కసుతో నాలుగు రోజులుగా తన పాడి ఆవుల నుంచి తీసుకొచ్చే పాలు తీసుకోకుండా టీడీపీ నేతలు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుసుకుని ఆ కుటుంబాన్ని ఆదుకుంటానని హామీ ఇచ్చారు.

దాడులను ఐక్యంగా ఎదుర్కొందాం

ఎన్నికల కౌంటింగ్ తర్వాత చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా జరిగే దాడులను ఐక్యంగా ఎదర్కొందామని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండలంలోని మండ్లపూడి, అవిలాల, వేదాంతపురం, పెరుమాళ్లపల్లి, చంద్రగిరి డివిజన్ పార్టీ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు దాడులకు ప్రతి దాడులు చేయడం పరిష్కారం కాదన్న ఆలోచనతో సంయమనం పాటించినట్టు వెల్లడించారు. ఇకపై అకారణంగా ఎవరిని కొట్టినా ఐక్యంగా పోరాటం చేయడానికి సంసిద్ధులు కావాలని ఆయన సూచించారు. కార్యకర్తలు, నాయకులను కాపాడుకోవడానికి ఎంతవరకైనా వెళ్తానన్నారు.

ఎంతో మంది గెలిచారు.. ఓడారు..

చంద్రగిరి నియోజకవర్గంలో ప్రత్యర్థులు లేకుండా చేయాలన్న దుష్ట ఆలోచనతో ఇలాంటి దురాగతాలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని చెవిరెడ్డి తేల్చిచెప్పారు. 2019 లో తాము అధికారంలోకి రాగానే మూడున్నరేళ్ల పులివర్తి నాని తన కార్యకర్తలను గాలికొదిలి వెళ్లిపోయారని, అయినా ఎవ్వరికీ తాను హాని చెయలేదని గుర్తుచేశారు.

ఓటమి బాధలోనూ కార్యకర్తల కోసం..

చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను తన బిడ్డల్లా చూసుకున్న చెవిరెడ్డి తన బిడ్డ ఓటమి బాధ నుంచి తేరుకోక ముందే కార్యకర్తలపై జరుగుతున్న వరుసదాడులకు చలించిపోయారు. కార్యకర్తల కోసం ఇంటి నుంచి బయటకు వచ్చి ఊరూరు తిరుగుతూ నేనున్నాను అన్న భరోసాతో మనోధైర్యం కల్పిస్తున్నారు. ఓటమి బాధలోనూ చెవిరెడ్డి తన కార్యకర్తలకు అండగా నిలబడటం పట్ల పలువురు కన్నీరు పెట్టుకున్నారు. ఇకపై నిత్యం అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతానని చెవిరెడ్డి హామీ ఇవ్వడంతో నాయకుల్లో భయం వీడి సంతోషం నిండుకుంది.



రామచంద్రాపురం : చిరంజీవిని పరామర్శిస్తున్న చెవిరెడ్డి






పాకాల: కన్నీటిపర్యంతమవుతున్న రమణ రమణయ్యగారిపల్లి సర్పంచ్ కుటుంబ సభ్యులు పూలదుకాణాన్ని పరిశీలిస్తున్న చెవిరెడ్డి

పాకాల: ధ్వంసమైన సతీష్

ఇర్షాద్ కుటుంబానికి చెవిరెడ్డి పరామర్శ



ఇర్షాద్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు పంచాయతీ వార్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇర్షాద్ కుటుంబ సభ్యులను చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. దాడి తెలిసిన వెంటనే చిన్నగొట్టిగల్లుకు చేరుకున్న ఆయన .. ఇర్షాద్ ఇంటి వద్ద ఉన్న అతని తల్లిని, ఇర్షాద్ కుమారుడు, కుమార్తెను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించి తిరిగి తీసుకొస్తామన్నారు. ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, మాజీ సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, స్థానిక సర్పంచ్ మనోహర్, జేసీఎస్ కన్వీనర్ ఖదీర్‌అహ్మద్, మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి తరలివచ్చారు.

అయ్యప్పరెడ్డిపాళెంలో చోరీ

- 15 సవర్ల బంగారు నగలు, ల్యాప్‌టాప్ అపహరణ

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ సమీపం, జాతీయ రహదారి పక్కనే ఉన్న జగనన్న కాలనీలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఓ ఇంట్లో దాచి ఉన్న సుమారు 15 సవర్ల బంగారు నగలు, ల్యాప్‌టాప్ అపహరించుకుని పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడి కథనం... దాసరి అనిల్, అతని భార్య ఇంద్రజ, పిల్లలతో కలసి అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ జాతీయ రహదారి పక్కనే జగనన్న కాలనీలో నివాసం ఉంటున్నారు. అనిల్ చెన్నైలో ప్రయివేటు ఉద్యోగి. అతని భార్య కాన్పుకోసం నెల్లూరులో ఉన్న పుట్టింట్లో ఉంది. ఈ క్రమంలో అనిల్ వారం రోజులుగా చెన్నైలో ఉంటున్నాడు. జాతీయ రహదారి పక్కనే తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తుతెలియని వ్యక్తి గుర్తించి లోకిని చొరబడ్డాడు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 7 గంటల వరకు ఇంట్లోనే ఉండి.. ఓ డబ్బాలో దాచి ఉన్న సుమారు 15 సవర్ల బంగారు నగలు, ల్యాప్‌టాప్ దోచుకెళ్లాడు. శనివారం ఉదయం 7 గంటల సమయంలో ఇంటి సమీపంలో ఉన్న వారు గుర్తించి కేకలు వేయడంతో గుర్తుతెలియని వ్యక్తి వారిపై రాళ్లు విసిరి అక్కడి నుంచి జాతీయ రహదారిపై బైక్‌లో ఉన్న మరోక వ్యక్తితో కలిసి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయనున్నట్టు వెల్లడించారు.



చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా వస్తువులు, దుస్తులు

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

తిరుపతి తుడా: బర్డ్ ఆస్పత్రిలో 110 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ మేరకు బర్డ్ ఆస్పత్రిలో శనివారం దివ్యాంగులకు వాటిని అమర్చారు. ఇటీవల తమిళనాడు ధర్మపురికి చెందిన దాత సుబ్రమణియన్ బర్డ్ ఆస్పత్రిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆధునీకరణకు రూ.కోటి విరాళంగా అందించారు. ఇందులో భాగంగా యూకే సాంకేతిక సహకారంతో ఎండోలైట్ కంపెనీ వారు వీటిని తయారు చేశారు. అత్యాధునిక సాంకేతిక సహకారంతో తయారు చేసిన ఈ అవయవాలు ఎక్కువ మన్నిక గలవని బర్డ్ అధికారులు తెలిపారు. బర్డ్ ఆస్పత్రి చేస్తున్న సేవలకు గాను ఎండోలైట్ కంపెనీ వారు అసలు ధరలో 50 శాతం రాయితీతో సమకూర్చారు. అల్యూమినియంతో తయారు చేసిన ఈ కృత్రిమ అవయవాలను టీటీడీకి అందించారు. వీటిని ధరించిన రోగులు సాధారణ వ్యక్తుల్లాగే అత్యంత సులభంగా ఎలాంటి ఇబ్బందీ లేకుండా నడవగలుగుతున్నారని ఆస్పత్రి స్పెషలాఫీసర్ డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. ఇదివరకు తాము జైపూర్, ఇతర ప్రాంతాల్లో తయారైన కృత్రిమ అవయవాలను ఉపయోగించామని, వాటికంటే ఇవి అత్యధిక సౌకర్యవంతంగా ఉన్నాయని రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. బర్డ్ ఆస్పత్రి డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది, రోగుల బంధువులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి కృత్రిమ కాలను అమరుస్తున్న వైద్యులు

నువ్వా.. నేనా!

- శ్రీవారిమెట్టు మార్గంలో ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్ల మధ్య ఘర్షణ
- తిరుపతికి చెందిన ట్యాక్సీ డ్రైవర్లను చితకబాదిగిన ఆటో డ్రైవర్లు
- శ్రీవారిమెట్టు వద్ద దర్శన టోకెన్లపై వివాదాలు



తిరుపతి డ్రైవర్లపై కర్రలతో దాడి చేస్తున్న స్థానిక ఆటో డ్రైవర్లు

చంద్రగిరి: శ్రీవారిమెట్టు వద్ద శ్రీవారి భక్తులకు టీటీడీ అధికారులు ఏర్పాటు చేసిన టైం స్లాట్ టోకెన్లకు సంబంధించి తిరుపతి–చంద్రగిరికి చెంది ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్ల మధ్య శనివారం ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో నలుగురు ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలు.. తిరుపతి జీవకోనకు చెందిన వెంకటేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే శనివారం ఉదయం శ్రీవారి భక్తులను తిరుపతిలో ఎక్కించుకుని శ్రీవారిమెట్టు వద్ద గల టైంస్లాట్ టోకెన్ల వద్దకు తీసుకొచ్చాడు. భక్తులు టోకన్లు పొందిన తర్వాత తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గ మధ్యంలోని పంప్ హౌస్ వద్ద శ్రీనివాసమంగాపురానికి చెందిన ఆటో డ్రైవరు పవన్‌తో పాటు మరో 9 మంది డ్రైవర్లు వెంకటేష్ ఆటోను అడ్డగించారు. తిరుపతి నుంచి భక్తులను తీసుకొచ్చినప్పటికీ, వారిని శ్రీనివాసమంగాపురంలోనే వదిలేయాలంటూ వెంకటేష్‌తో వాదనలకు దిగారు. ఆపై వెంకటేష్‌పై దాడికి పూనుకున్నారు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన డ్రైవర్లు లోకేష్, వంశీ, త్రివిక్రమ్ భక్తులను తీసుకొస్తూ, తమ డ్రైవరును దాడి చేస్తున్నారని గమనించి ఆపేందుకు యత్నించారు. వారిపైనా కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. అనంతరం గాయపడిన డ్రైవర్లు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రవీంద్ర నాయక్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

తరచూ వివాదాలే

శ్రీవారిమెట్టు నుంచి తిరుమల కాలినడకన వెళ్లే భక్తులకు టీటీడీ అధికారులు అందిస్తున్న టైం స్లాట్ టోకన్ల కారణంగా తరచూ గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో శ్రీవారి మెట్టు గుండా తిరుమలకు వెళ్లే భక్తులకు మార్గ మధ్యంలోని 1500వ మెట్టు వద్ద టోకన్లను జారీ చేసేవారు. ఆ తర్వాత మార్గంలోని తిరుమల సమీపంలో టోకన్లకు స్టాపింగ్ ఉండేది. ఈ చర్యల వల్ల భక్తులకు టోకన్ల సక్రమంగా లభించడంతో త్వరితగతిన శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉండేది. అయితే ప్రస్తుతం అధికారులు టోకన్లను మెట్లు ప్రారంభంలోనే ఇవ్వడం, వాటిపై స్టాంపింగ్ లేకపోవడంతో కాలినడకన వెళ్లని భక్తులు సైతం టోకన్లను పొంది తిరిగి వాహనంలో తిరుమలకు వెళ్తున్నారు. ఇదే అదునుగా భావించిన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు తిరుపతిలోనే భక్తులతో భారీగా ఒప్పందం కుదుర్చుకుని వారిని ఇక్కడకు తీసుకొస్తున్నట్లు తెలుసోంది. దీనిపై టీటీడీ అధికారులు స్పందించాల్సి ఉంది .